కొసమెరుపు కథ

# పరమసూన్యం

-జి.వి.జి




బలమైన కారణం ఏదయితేనేం-నూకరాజు చివరికి ఆత్మహత్య చేసుకోవడానికే నిర్ణయించాడు. అందుకు అనువుగా రైల్వే ఔటర్ సిగ్నల్‌కు పది అడుగుల దూరంలో రైలు పట్టాల మీద-అని స్థలాన్ని కూడా ఎంచుకున్నాడు. రాత్రి పన్నెండు - పన్నెండుం బావు మధ్యన ఆ నిర్జీన ప్రదేశంలో హౌరామెయిల్ చీకటిని చీల్చుకుంటూ శరవేగంతో వెళ్తుంది. క్షణాల్లో తన తనువు చాలించుకోవచ్చు.

మరి, అంతవరకు నాలుగు గంటల పాటు ఎలా గడపడం? నూకరాజు దీర్ఘాలోచనలో క్షణకాలం కళ్ళు మూసుకున్నాడు. ఏదైనా సినిమాహాలులో గడపడం మంచిదనుకొని కళ్ళు తెరిచాడు. సరే... ఏ సినిమాకు వెళ్ళడం! ఒక సినిమా వార పత్రిక కొన్నాడు. అందులో అప్పుడే విడుదలైన 'పరమసూన్యం' చిత్రం గురించి గోరంతలు కొండతలు చేసి రాయబడి ఉండడం చదివాడు.

పెన్సార్ వారి ప్రశంసలు పొందిన చిత్రం

**"పరమసూన్యం"**

మనకున్న కొద్దిమంది క్రేజీ దర్శకులలో ఒకరైన సింహాచలం ఒక కొత్త డిఫరెంట్ పాయింట్ తీసుకొని, ఆరుమాసాల పాటు కథ మీద కూర్చున్నారు. మారుతున్న ప్రేక్షకుల అభిరుచులకు అనుగుణంగా దర్శకుడు కథ వినిపించిన తీరు నవ్యతగా నిర్మాతకు ఎంతో నచ్చింది. ఆయన మరి కొన్ని ఆసక్తికరమైన విషయాలు చెప్పాడు. "రొటీన్ చిత్రాలకు భిన్నంగా ఆనావట్టి ట్రీట్‌మెంట్‌ను ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా- తప్ప కుండా విజయం సాధించి తీరాలనే కసితో నిర్మించాను. కేరక్టర్‌లు, కేరక్టరైజేషన్ పరంగా చూస్తే ఇది మా హీరోకు విభిన్నమైన కథ... సో... ఆయనకి మా హీరోయిన్ సక్సస్‌ఫుల్ కాంబినేషన్. అదనంగా ఒక పాటను విదేశంలో చిత్రీకరించదలచిన మేము కోరిన వెంటనే కాల్‌షీట్లు సర్దుబాటు చేసిన వారిద్దరకీ ఎంతైనా కృతజ్ఞులం. అంతవరకు ఎడతెరపి లేకుండా కుంభపోతగా కురుస్తూన్న వర్షం ఆ విదేశంలో షూటింగ్ రోజున హఠాత్తుగా తెరపి ఇచ్చింది. సూర్యభగవానుడు కూడా మాకెంతో సహకరించాడు. మొత్తం మీద చక్కని ప్లానింగ్‌వల్ల 90 రోజుల్లో ప్లాన్ చేసిన చిత్రాన్ని పిక్నిక్‌లా 30 రోజుల్లోనే పూర్తి చేశాం. సెన్సేషనల్ హిట్ ఇవ్వాలన్న తపన, పట్టుదలతో మా యూనిట్‌లోని వారందరం కసితో కృషి చేశాం. ...సో... ఈ తరహా చిత్రాన్ని ప్రేక్షక దేవుళ్ళు ఆదరిస్తే, ఇంతటి క్వాలిటీ చిత్రాలే మా సంస్థ నిర్మించే అవకాశముంటుంది. నిరుడు మా డైరక్టర్ పుట్టిన రోజున విడుదలైన చిత్రం సూపర్‌హిట్ అయింది గనుక, ఈ ఏడు ఆయన జన్మదినాన్నే మా చిత్రాన్ని విడుదల చేసి, మెగాహిట్ చేయబోతున్నాం. ఇదివరకే మా ఆడియో కేసెట్టు సూపర్‌హిట్ అయింది. వచ్చేవారం అన్ని సెంటర్లకు మా విజయయాత్ర కూడా సూపర్‌హిట్ కాబోతోంది. ఇకపోతే మా 'పరమసూన్యం' టైటిల్‌కి ఏనాడో మంచి రెస్పాన్స్ వచ్చింది. ...సో... ఎప్పుడో తాము రిజిష్టర్ చేసి ఉంచిన ఆ టైటిల్‌ను అడగ్గానే మాకిచ్చిన కుచేలా ప్రొడక్షన్స్ అధినేతలకు కృతజ్ఞులం... "

"ఛీ...ఏమిటీ అరిగిపోయిన గ్రామఫోన్ రికార్డు!" విసుక్కుంటూ నూకరాజు ఆ సినిమా వార్తను పూర్తిగా చదవలేక పోయాడు. తర్వాత ఆ సినిమాను కూడా పూర్తిగా చూడలేకపోయాడు. హాలులోంచి బయటకు వచ్చి, నాలుగు అడుగులు వేయగానే ఆగి, వెనుతిరిగి థియేటర్ వంక వికారంగా చూశాడు. 'ఛీ...పరమసూన్యం కాదు, పరమచెత్త. ఇంతటి ఛండాలపు సినిమాకు సిమిష్టిగా కృషి చేసిన వారందరూ హాయిగా, సజీవంగా ఉంటే నేను చావాలనుకోవడమేమిటి? ఛీ... చావలేను... చావను!! అంటూ నూకరాజు పిడికిలి బిగించాడు.

మెల్లగా ఇంటిదారి పట్టాడు. ❋